ong-5_ong-5.qxd 5/13/2026 12:22 AM Page 1



## శ్రీ హరి హర క్షేత్రంలో వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు

**చీమకుర్తి, మే 12, ప్రభాతవార్త**





హనుమజ్జయంతి సందర్భంగా శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారికి విశేష పూజలు, హోమాలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు దంపతులు, శిద్దా పాండురంగరావు దంపతులు,శిద్దా సుధాకర్ దంపతులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, ఉభయ దాతలు, భక్తులు రుత్వికుల ఆలయ ధర్మ కర్తల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం శ్రీ గణపతి పూజ, పుణ్యాహవాచనం,అగ్ని ప్రతిష్ట, లక్ష్మీ గణపతి హోమము, మూలబింబ మంత్ర హోమములు, మన్య సూక్త హోమము, నవగ్రహ హోమం, శాంతి హోమం, మహా పూర్ణహుతి నిర్వహించారు.తదుపరి శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారికి 230 కలశములతో మరియు పంచామృత ఫలరస, సుగంధ ద్రవ్యములతో స్వామి వారికి అభిషేకం, అనంతరం స్వామి వారి విశేష అలంకరణ.. లక్ష నాగవల్లీ దళార్చన,మహా నైవేద్యం, మహా మంగళ హారతి, మహా మంత్ర పుష్పము, క్షమా ప్రార్థన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు భక్తులచే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం,హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్ భజన నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం స్వామి వారికి శిద్దా రాఘవ రావు దంపతులు,శిద్దా పాండురంగరావు దంపతులు,శిద్దా సుధాకర్ దంపతులు, యువ పారిశ్రామిక సుధీర్ కుమార్, భక్తులతో కలిసి విశేష పూజలు నిర్వహించారు. శ్రీ శిద్దా వెంకట సుబ్బమ్మ, వెంకటేశ్వర్లు ట్రస్ట్ అధ్వర్యంలో భక్తులకు,అన్న ప్రసాదాలు అందచేసారు. హనుమ జయంతి సందర్భంగా శ్రీ హరిహర క్షేత్రం నుండి చీమకుర్తి పుర వీధుల్లో స్వామి వారి నగరోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.చీమకుర్తి కి చెందిన హనుమాన్ భక్తులు,ఆర్యవైశ్య మహిళలు స్వామి వారి నగరోత్సవంలో పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం ఆలాపన చేశారు. ఈ కార్యక్రమంలో శిద్దా సుధాకర్ దంపతులు, శిద్దా పెద్ద బాబు, శిద్దా వెంకట ప్రసాద్, శిద్దా కాశీ, శిద్దా సాయి బాబు దంపతులు, ఆలయ ఇంచార్జ్ ఎమ్.వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు సుబ్రమణ్య శర్మ, హరి వెంకట కుమారా చార్యులు, హరి కృష్ణ శర్మ, కృష్ణ శర్మ, ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు.

## పవనసుతునికి భక్త జననిరాజనం.. ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**బల్లికురవ, మే 12, ప్రభాతవార్త**





వైశాఖ బహుళదశమి శుభవేళ, మంగళవారం స్వామి వారి పుట్టినరోజు పర్వదిన వేడుకలు గ్రామ గ్రామాన వేడుకలా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన స్వామి వారి అభిషేకాలు, ఆకు పూజలు, సింధూరభిషేకాలు, విశేష పూజలలో భక్తులు పాల్గొని శ్రీరామ భక్త హనుమాన్ సేవా భాగ్యాన్ని పొందారు. ఆంజనేయుని భక్తులు ఉపవాస దీక్షను ఆచరించి హనుమాన్ చాలీసా, సుందర కాండ పారాయణం ఆచరించి తరించారు. వాయు నందనుడు బలం, భక్తి, జ్ఞానానికి ప్రతీక. స్వామివారిని పుట్టినరోజు పూజించడం వల్ల ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, అష్టైశ్వర్యాలు సమకూర్తాయనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. మండలంలోని కొత్తపాలెం, గుంటుపల్లి, నక్క బొక్కలపాడు, ఉప్పుమాగులూరు, గొర్రెపాడు, కొండాయపాలెం, అంబడపూడి గ్రామాలలో పానకం ,వడపప్పు, అన్న వితరణ కార్యక్రమాలు కొనసాగాయి.

## ఈ ఏపీ సెట్ ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు ప్రారంభం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి ప్రారంభమైన ఏపీ ఈఏపీసెట్ ఇంజినీరింగ్ విభాగం పరీక్షలతో ఒంగోలులోని పరీక్షా కేంద్రాలు సందడిగా మారాయి. ఉదయం నుంచే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు భారీగా తరలివచ్చారు. నిబంధనల ప్రకారం పరీక్ష ప్రారంభానికి గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు చివరి నిమిషం వరకు పాఠ్యాంశాలను పునశ్చరణ చేసుకుంటూ కనిపించారు. కొందరు విద్యార్థులు స్నేహితులతో కలిసి ముఖ్యమైన అంశాలపై చర్చించగా, మరికొందరు ప్రశాంతంగా పరీక్షకు సిద్ధమయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద తల్లిదండ్రుల రద్దీ కూడా అధికంగా కనిపించింది. తమ పిల్లలకు"ఆల్ ది బెస్ట్ చెబుతూ ధైర్యం చెప్పేందుకు పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు కేంద్రాలకు చేరుకున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో కోలాహల వాతావరణం నెలకొంది. విద్యార్థుల గుర్తింపు ధృవీకరణ అనంతరం మాత్రమే కేంద్రాల్లోకి అనుమతించగా, ఎలక్ట్రానిక్ పరికరాలపై అధికారులు కఠిన నిఘా పెట్టారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు, పోలీసు సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కేంద్రాల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోగా, విద్యార్థులకు తాగునీరు తదితర సౌకర్యాలు కూడా కల్పించారు. జిల్లాలో పరీక్షలు ఎలాంటి అంతరాయాలు లేకుండా సజావుగా కొనసాగినట్లు అధికారులు తెలిపారు.

## ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు పోలీసుల అవగాహన

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**




ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలను పోలీసులు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఒంగోలులోని శ్రీ సరస్వతి జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ హాజరత్తయ్య, ఆర్ఎస్సై మాల్యాద్రి మరియు సిబ్బంది విద్యార్థులతో సమావేశమై రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. యువత ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపకూడదని, కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రతపై విద్యార్థులు కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, అధ్యాపకులు, సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు

**ఉలవపాడు, మే 12, ప్రభాతవార్త**



ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులకు మంగళవారం 41 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల చేత నీతి కథలు జాతీయ నాయకుల జీవిత చరిత్రలు చదివించి అనంతరం 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించినట్లు గ్రంథ పాలకుడు డి కోటేశ్వరరావు తెలిపారు.తరగతులకు హాజరైన విద్యార్థులకు ఏ విజయలక్ష్మి శీతల పానీయాలు, అల్పాహారం అందించారు.

## దుకాణంలో భారీ చోరీ

**చీమకుర్తి, మే 12, ప్రభాతవార్త**



చీమకుర్తి ఇసుకవాగు సెంటర్ వద్ద ఒక ఇనుప దుకాణంలో భారీ చోరీ జరిగింది. మెయిన్ రోడ్డు లోని ఏటీఎం పక్కన అద్దేపల్లి నగేష్ దుకాణంలో దొంగలు పడి సుమారు 30 సవర్ల బంగారం ,రెండు కేజీలు వెండి, 8 లక్షల రూపాయల నగదును దొంగిలించుకు వెళ్లారు. దొడ్డి దారిన ప్రవేశించి ఇనుప బీరువాను పగలగొట్టి ఈ నేరాన్ని పాల్పడ్డట్టు తెలుస్తోంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో సి ఐ ప్రసాదు తన బృందంతో తనిఖీలు చేపట్టారు. పోలీసు జాగిలాన్ని రప్పించి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## నీట్ యూజీ పరీక్ష రద్దు

**ఒంగోలు, ప్రభాతవార్త**

లక్షలాది మంది విద్యార్థులకు బిగ్‌షాక్ తగిలింది. నేషనల్ ఎలిజబులిటి కమ్ ఎంట్రన్స్ టెస్ట్ అండర్ గ్రాడ్యుయేట్ పరీక్ష రద్దైంది. ఈ మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల3వ తేదీన నిర్వహించిన నీటి, యూజీ 2026 పరీక్షను రద్దు చేసినట్లు వెల్లడించింది. త్వరలో కొత్త తేదీలను ప్రకటించి తిరిగి పరీక్ష నిర్వహిస్తామని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. పేపర్ లీక్ కావడం,పరీక్ష ప్రక్రియలో లోపాలు ఉన్నాయని తేలడమే ఈ నిర్ణయానికి కారణం. రాజస్థాన్‌లో పేపర్ లీకైనట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.3వ తేదీన పరీక్షలు జరగ్గా 8న దీనిపై విచారణను కేంద్ర దర్యాప్తు ఏజెన్సీకి అప్పగించింది. ప్రభుత్వం ప్రస్తుత పరీక్షల విధానం ఆమోద యోగ్యం కాదని, సీబీఐ నివేదికను ప్రభుత్వానికిఅందజేసినట్లు సమాచారం. అనేక లోపాలు ఉన్నట్లు గుర్తించింది. దాంతో నీట్ యూజీ పరీక్ష మొత్తాన్ని రద్దు చేసింది. ఈపరీక్షను మళ్లీ నిర్వహిస్తామని ప్రకటించింది. నూతన పరీక్షా తేదీలను త్వరలో నిర్ణయిస్తామని ఎన్‌టీఏ పేర్కొంది.ఈ ఏడాది నీట్ పరీక్షకు దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.ఇప్పుడు వారంతా కూడా మరోవిడత పరీక్షకు సన్నద్ధం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# ఎన్నికలు వచ్చేస్తున్నాయ్

- స్థానిక ఎన్నికలపై ప్రభుత్వం దృష్టి
- సన్నాహాలపై కలెక్టర్లకు సీఎం సూచనలు
- ఆశావాహుల్లో మొదలైన సందడి

**ఒంగోలు, ప్రభాతవార్త**

స్థానిక సంస్థల సందడి అతి త్వరలో ప్రారంభం కానుంది. ఆ వైపుగా ప్రభుత్వం సన్నాహాల్లో తలమునకలైంది. ఏ రోజైన నోటిఫికేషన్ వచ్చే అవకాశంకనిపిస్తుంది. ఎన్నికలకు సంబంధించి కలెక్టర్లకు సీఎం చంద్రబాబు సూచనలు ఇచ్చారు. అమరావతిలో ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో స్థానిక సంస్థల ఎన్నికలపై వారితో మాట్లాడారు. అయితే ముందుగా పంచాయతీలకా..? లేకుంటే మున్సిపల్ ఎన్నికలకు వెళ్తారా..? అన్నది తెలియాల్సి ఉంది. ఇప్పటికే మున్సిపాలిటీ పాలకవర్గాల గడువు మార్చి 17తో ముగిసింది. ఆర్డీవో స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. అటు సర్పంచ్‌ల పదవీ కాలం ఏప్రిల్4తో ముగి సింది. వాటికి సైతం ప్రత్యేకాధికారుల నియామకం పూర్తయింది. సెప్టెంబర్‌లో ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీ కాలం ముగియ నున్నది. వాటికి సైతం ప్రత్యేకాధికారుల నియామకం జరగనుంది. అయితే మున్సిపాలిటీలకు ప్రత్యేకాధికారులను నియమించి రెండు నెలలు సమీపిస్తుంది. పంచాయతీలకు నెల దాటింది. పాలక వర్గాలు ముగిసిన ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలి. ఈ నిబంధనల నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు నేరుగా కలెక్టర్ల సదస్సులో ఆదేశాలు ఇచ్చే సరికి ఎన్నికల ప్రక్రియ వీలైనంత త్వరగా ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తుంది. మున్సిపాలిటీలలో వార్డుల విభజన ప్రక్రియ చురుగ్గా సాగుతుంది. జిల్లాలో ఒంగోలు నగర పాలకసంస్థ, చీమకుర్తి, అద్దంకి, పొదిలి నగర పంచాయతీలు



ఉన్నాయి. కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉన్నాయి. విభజనతో వాటి సంఖ్య 62కు పెరిగే అవకాశం ఉంది. మిగతా మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో కూడా వార్డులు పెరగనున్నాయి. వీటి సంఖ్య సైతం పెరుగుతుంది. వార్డుల విభజన ప్రక్రియ ప్రస్తుతం చురుగ్గా జరుగుతుంది. పెరిగిన డివిజన్లు, వార్డులపై ఈ నెల 17న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నెల 17 నుంచి 27వరకు వాటిపై అభ్యంతరాల స్వీకరణ, అనంతరం జూన్‌లో గజిట్ ఇవ్వనున్నారు. జిల్లాలో పంచాయతీలు 729 ఉన్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అయితే 1042 పంచాయతీలు ఉన్నాయి. ఒక వేళ పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం మొగ్గుచూపితే మాత్రం డివిజన్ల వారీగా పోలింగ్ జరిపి ఫలితాలను ప్రకటిస్తారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రాదేశికాలకు సంబంధించి ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయి. ఉమ్మడి జిల్లాగానే జిల్లా పరిషత్ ఉంది. ఒక వేళ విభజించి ఎన్నికలు నిర్వహిస్తామంటే 28 మండలాల వరకు చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలో అయితే 56 జడ్పీటీసీ స్థానాలతో పాటు సుమారు 600లకు పైగా ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే స్థానిక ఎన్నికలకు సంబంధించి బీసీ గణన అడ్డంకిగా ఉంది. ఇప్పటికే ఆ సమస్య పరిష్కారానికి ఏకసభ్య కమీషన్‌ను నియమించింది. కమీషన్ ముగియనున్నది.మరోవైపు సీఎం చంద్రబాబు సైతం స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో సంకేతాలు ఇవ్వడంతో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# తాగునీటి నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం..

- జాప్యాన్ని ఉపేక్షించేది లేదు
: హెచ్చరించిన కలెక్టర్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



త్రాగునీటి నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం, జాప్యాన్ని ఏమాత్రం ఉపేక్షించబోనని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం పనులు నిర్వహించకపోతే కాంట్రాక్టర్లతో పాటు సంబంధిత అధికారులపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న తాగునీటి నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పైప్‌లైన్ విస్తరణ, ఓవర్ హెడ్ ట్యాంకులు, నీటి నిల్వ సదుపాయాలు, పంపింగ్ వ్యవస్థల పనుల గురించి అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కొన్ని ప్రాంతాల్లో పనులు మందగమనంలో ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్ పనుల పురోగతిని వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి కొరత తలెత్తకుండా అత్యవసర ప్రాధాన్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే ప్రారంభించి నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ ఉండకూడదని, అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షణ నిర్వహించాలని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనుల అమలులో సమన్వయం పెంచాలని పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి జాప్యం ఉండదని, అయినప్పటికీ కాంట్రాక్టర్లు ఉద్దేశపూర్వకంగా పనులు ఆలస్యం చేస్తే బ్లాక్ లిస్టింగ్‌తో పాటు ఇతర కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాగునీటి ప్రాజెక్టులు ప్రజల ఆరోగ్యానికి నేరుగా సంబంధం ఉన్నవని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డిపిఓ వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జమ్మూకాశ్మీర్ సమీక్షలో పాల్గొన్న ఎంపి మాగుంట

**ఒంగోలు, ప్రభాతవార్త**




గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ స్టడీ టూర్‌లో భాగంగా గుల్ మార్గ్‌లో కమిటీ చైర్మన్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జమ్మూ, కాశ్మీర్ పరిపాలన శాఖ, గృహ - పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, గుల్మార్గ్ అభివృద్ధి సంస్థ, బారాముల్లా మున్సిపల్ కౌన్సిల్, శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్, ఆర్థిక మంత్రిత్వ శాఖ, హడ్కో, ఎన్‌బీసీసీ, సీపీడబ్ల్యూడీ, స్టేట్ బ్యాంకు, జమ్మూ కాశ్మీర్ బ్యాంకు తదితర సంస్థల ప్రతినిధులతో, ఇతర కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో అమృత్, అమృత్-2, స్వచ్ఛ భారత్ మిషన్- అర్బన్, పీఎంఏవై-2.0, పీఎంఎస్‌వీఏనిధి, అర్బన్ ఛాలెంజ్ ఫండ్, నుడమ్, పీఎం ఈ బస్‌సేవ పథకాల పనితీరు, హడ్కో, ఎన్‌బీసీసీ, సీపీడబ్ల్యూడీ, పనితీరు, బారాముల్లా, శ్రీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ల ఆదాయ పెంపు, బడ్జెట్ నిర్వహణ వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ చర్చలలో ప్రతినిధులు కోరిన సదుపాయాలు, చేసిన సూచనలను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని వారికి మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు.

## కొండపిలో ఘనంగా ఆంజనేయస్వామి జయంతి వేడుకలు

**కొండపి, ప్రభాతవార్త**





కొండపి మండలంలోని పలు గ్రామాల్లో ఆంజనేయస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొండపిలోని జెండా చెట్టు సెంటర్ ఉన్నటువంటి ఆంజనేయస్వామి విగ్రహం వద్ద జయంతి వేడుకల్ని హరిబాబు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలశ్రీ బాలవీరాంజనేయస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు మంత్రిగారు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని పెరిదేపి గ్రామంలో బాలు మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి ఆధ్వర్యంలో జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బాలు మల్లికార్జున భక్తుడు మొక్కుబడిలో భాగంగా ఏర్పాటు చేసి స్వామివారికి మొఖబడి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ఆధ్వర్యంలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఏ ఉప్పలపాడులో ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ప్రధాన పూజారి రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## త్రినేత్ర దర్శనంతో హనుమత్ జయంతి వైభవం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు సంతపేటలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమత్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో రుద్ర హోమం, లక్ష్మీ గణపతి హోమం, మన్యసూక్త హోమం, మహా సంప్రోక్షణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. హనుమత్ జయంతి సందర్భంగా స్వామి వారికి పంచామృతాలు, పసుపు, కుంకుమ, గంధం, విభూతి, సింధూరంతో పాటు పండ్ల రసాలతో విశేష అభిషేకం చేశారు. అనంతరం పట్టు వస్త్రాలంకరణ, పుష్పార్చనలు నిర్వహించి ప్రత్యేక దర్శనం కల్పించారు. కార్యక్రమానికి భగీరథ కెమికల్స్ డైరెక్టర్ లింగమనేని వెంకట్రామయ్య, ఆయన ధర్మపత్ని సౌజన్య ముఖ్య ఉభయకర్తలుగా వ్యవహరించారు. సింగవరపు చంద్రశేఖర్ సహకారంతో శతాబ్దం నాటి ఆలయాన్ని పునరుద్ధరించినట్లు నిర్వాహకులు తెలిపారు. మే 13న స్వామివారి కళ్యాణ మహోత్సవం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## రీసర్వేతో రెవెన్యూ సమస్యల పరిష్కారం: జేసి

**టంగటూరు, ప్రభాతవార్త**



ఐదవ విడత రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా వల్లూరు గ్రామాన్ని సందర్శించిన ఆమె గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ తీరును పరిశీలిస్తూ రైతులకు ముందస్తు నోటీసులు జారీ చేసి వారి సమక్షంలోనే ఈకేవైసీ నిర్వహిస్తున్నారా అని అధికారులను ఆరా తీశారు. అధికారులు నిబంధనల ప్రకారమే ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు స్థానిక రైతులు జాయింట్ కలెక్టరుకు తెలిపారు. గ్రామంలో సర్వే నిర్వహణ, భూ వివరాల నమోదు, హద్దుల గుర్తింపు వంటి అంశాలను పరిశీలించిన ఆమె ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా రీసర్వే చేపట్టాలని అధికారులకు సూచించారు. రీసర్వే ప్రక్రియ ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ, రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు. తర్వాత ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన"కిషోరి వికాసం కార్యక్రమంలో పాల్గొని కిషోర బాలికల ఆరోగ్యం, విద్య, పోషకాహారం, సాధికారతపై ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా చేర్చాలని అధికారులకు సూచించారు. బాలికలలో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా సర్వే అధికారి గౌస్ బాషా, ఎంపీడీవో దేవసేన కుమారి, తహసీల్దార్ ఆంజనేయులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద ఆక్వారంగ రైతుల నిరసన

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




జిల్లాలో రొయ్యల ఫీడ్ ధరలను వరుసగా పెంచుతున్న ఫీడ్ కంపెనీల తీరుపై ఆక్వా రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గిట్టుబాటు ధరలు లేక నష్టాలతో సాగు కొనసాగిస్తున్న సమయంలో ఫీడ్ ధరలు భారీగా పెరగడం వల్ల ఆక్వా రంగం తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టబడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద వివిధ రొయ్యల రైతు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. ఎ పి ఎస్ ఎ డి ఎ అనుమతి లేకుండానే కొన్ని ఫీడ్ కంపెనీలు ఏకపక్షంగా ధరలు పెంచుతున్నాయని ఆరోపిస్తూ వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జిల్లాలో వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతుండగా రైతులు బ్యాంకులు, ప్రైవేట్ అప్పులతో సాగు కొనసాగిస్తున్నారని తెలిపారు. అయితే మార్కెట్లో రొయ్యలకు సరైన ధరలు లేకపోవడంతో పెట్టుబడులు కూడా తిరిగి రాక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అనేక మంది రైతులు చెరువులు ఖాళీ చేసి సాగును పూర్తిగా విరమించుకునే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఆక్వా రంగంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే రంగం తీవ్ర ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉందన్నారు. నిరసన కార్యక్రమంలో జిల్లాలోని పలు మండలాల రైతులు, ఆక్వా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అండర్-17 ఫెన్సింగ్ జట్ల నమోదు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్17 ఫెన్సింగ్ జట్ల ఎంపికకు సంబంధించి ఆన్లైన్ నమోదు కార్యక్రమాన్ని మే 13న ఒంగోలు మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి నవీన్ తెలిపారు. జిల్లాలో ఫెన్సింగ్ క్రీడను ప్రోత్సహిస్తూ ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 2010 జనవరి 1 నుంచి 2013 డిసెంబర్ 31 మధ్య జన్మించిన బాలబాలికలు మాత్రమే ఎంపికలకు అర్హులని వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తప్పనిసరిగా జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, విద్యాసంస్థ గుర్తింపు పత్రాలు తదితర అవసరమైన డాక్యుమెంట్లతో హాజరు కావాలని సూచించారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ కల్పించి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీలకు సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు.

6:6.qxd 5/13/2026 12:23 AM Page 1



## మార్టూరు మండలంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహణ - ఎంఈఓ

మార్టూరు, మే 12, ప్రభాతవార్త



మండలంలోని ద్రోణాదుల గ్రామంలోని మూడు పాఠశాల పరిధిలోను, మార్టూరు గ్రామంలోని నేతాజీ నగర్ రామ్ నగర్ ఉన్న 5ఏళ్ల పై బడిన పిల్లలు, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లేటువంటి విద్యార్థులను ఒకటో తరగతి, ఇతర తరగతులలో అడ్మిషన్స్ పొందే నిమిత్తం మండల విద్యాశాఖ అధికారులు ఎంసీహెచ్ వస్త్రామ్ నాయక్, కే.ప్రేమలత, ద్రోణాదుల కాంప్లెక్స్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.పోతురాజు ప్రభుత్వ పాఠశాలలో పెంపుదల కోసం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను ఫౌండేషన్, బేసిక్, మోడల్ పాఠశాలలుగా రూపొందించి ఉత్తమ విద్యను అందించడానికి ప్రతి తరగతి ఒక ఉపాధ్యాయుడు చొప్పున కేటాయించి మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయులు కూడా అందుకు అవసరమైన టెక్నాలజీని ఉపయోగించుకుని నైపుణ్యాన్ని పెంపొందించుకుని విద్యను అభ్యసిస్తున్నందున, ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న ఉచిత సౌకర్యాలను వినియోగించుకొని శిక్షణ పొంది అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబుద్ధులు నేర్పించాలని, విద్యార్థులకు పూర్తి స్థాయిలో విద్యా నైపుణ్యాలను నేర్పించే బాధ్యత మా ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు తీసుకొని విద్యాబోధన చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసాని కల్పించారు. ఈ కార్యక్రమంలో ద్రోణాదుల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు వి.వెంకట స్వామి, పి.వీరాంజనేయులు, టి.రాఘవయ్య, టీచర్స్ పి.తిరుపతయ్య, బి.ఐజక్, డానియల్, డి.ఏలియా, పెద్ద సుబ్బారావు, మార్టూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసు, ఏ.సూర్యప్రకాష్, సీఆర్పీలు జి.రమేష్, ఎస్.రామారావు పాల్గొన్నారు.

## మెగా ఆయుర్వేద వైద్య శిబిరంలో 120 మందికి చికిత్సలు

సంతనూతలపాడు, మే 12, ప్రభాతవార్త



సంతనూతలపాడులోని జెండా చెట్టు వద్ద గల శ్రీ వీరాంజనేయస్వామి హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా సంతనూతలపాడు మండల ఆయుర్వేద శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి మెగా వైద్య శిబిరంలో 120 మంది రోగులకు చికిత్సలు అందజేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక యాదవ్ సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఆయుర్వేద శాఖ వారు ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మోకాలు నొప్పులు, గ్యాస్ట్రిక్ ట్రబుల్, నడుము నొప్పి, చిగుళ్ళ సమస్యలు, చర్మవ్యాధులు, వివిధ రకాల పాత వ్యాధులను రోగులకు సంబంధించి వైద్యులు ఏ.కరుణాకర్‌రావు పరీక్షించి తదుపరి మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదం చక్కటి పరిష్కారం అని ప్రజలు దీనిని సద్వినియోగపరుచుకోవాలని వైద్యులు కరుణాకర్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద ఎంఎన్ఓ పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా జెండా చెట్టు వీరాంజనేయస్వామికి హనుమాన్ జయంతి వేడుకలు

### - యాదవ సంఘం ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నదాన వేడుకలు

సంతనూతలపాడు, మే 12, ప్రభాతవార్త



సంతనూతలపాడులోని జెండా చెట్టు వద్ద గల శ్రీవీరాంజనేయస్వామి వారికి స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. గత 40 రోజుల నుండి స్వామి వాళ్లకు మహిళలు వైభవంగా హనుమాన్ చాలిస్ వేడుకలను నిర్వహించారు. మంగళవారం నాడు అర్చకులు కూడా శివరామకృష్ణ ఆధ్వర్యంలో వీరాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత 15 సంవత్సరాల నుండి సంతనూతలపాడులో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మహిళలు భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. వేలాది మందికి అన్నదాన వేడుకలు నిర్వహించారు. భజన, కోలాట, కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సంతనూతలపాడులో ఈ వేడుకలు ఒక పండుగ వాతావరణంలో జరిగాయి. అదే విధంగా సంతనూతలపాడులోని ఆశ్రమం వద్ద, స్థానిక గానుగపాలెం, చెన్నకేశవస్వామి ఆలయం, పోలీసు స్టేషన్ వద్ద గల పంచముఖి స్వామి ఆలయం, తక్కెళ్ళపాడులో ఆంజనేయస్వామి ఆలయం, పాలకేంద్రం వద్ద ఆంజనేయస్వాములకు ఘనంగా ఈ వేడుకలు నిర్వహించారు. తదుపరి అన్నదాన వేడుకలు చేపట్టారు. మండలంలో పలు కేంద్రాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు.

## కిశోర బాలబాలికలు అన్ని రంగాల్లో ముందంజలో నిలవాలి

సంతనూతలపాడు, మే 12, ప్రభాతవార్త



కిశోర బాలబాలికలు సమాజంలో మంచి పరివర్తన ద్వారా అన్ని రంగాల్లో ముందంజలో నిలవాలని జిల్లా ఐసీపీఎస్ పీఓ ఐ.లక్ష్మీ కోరారు. సంతనూతలపాడు లోని మండల వెలుగు కార్యాలయంలో మంగళవారం నాడు జరిగిన కిశోరి వికాసం సమ్మర్ స్పెషల్ ఆరోగ్య మేళా అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి మండల వెలుగు ఏపీఎం టి.బాబురావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.సావిత్రి పర్యవేక్షించారు. ప్రభుత్వం కిశోర బాలబాలికలను అన్ని విధాల అభివృద్ధి పరిచేందుకు గాను ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు పీఓ లక్ష్మీ పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు కిశోర్ బాలబాలికలు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు స్ఫూర్తితో ముందంజలో నిలవాలన్నారు. బాల్య వివాహాలు చేయరాదన్నారు. పనులకు వెళ్ళవద్దన్నారు. అదే విధంగా తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు ఉంటే దానిని తమ దృష్టికి తీసుకువస్తే వారికి బోర్డింగ్, భోజనం, విద్య, అవకాశాలు కల్పించనున్నట్లు పీవో లక్ష్మీ తెలిపారు. కిశోర బాలబాలికలను సమాజంలో అన్ని రంగాల్లో రాణించేందుకు మరింతగా చైతన్య పరచాలని మండల వెలుగు ఏపీఎం టి.బాబురావు ఈ సందర్భంగా వీఓఏలకు సూచనలు చేశారు. అంతకమునుపు మండలంలోని రుద్రవరం గ్రామంలో కిశోరి వికాసంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి పర్యవేక్షణలో వేసవి సమ్మర్ స్పెషల్ ఆరోగ్యమేళాపై కిశోర బాలబాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ప్రసూన, వెలుగు సీసీలు, సీహెచ్ శ్రీనివాసులు, చెంచులక్ష్మీ, రామాంజనేయులు, వి.శ్రీనివాసులు, వీఓఏలు, కిశోర బాలబాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కిశోరి వికాసంపై మద్దిపాడులో మండల స్థాయిలో సమీక్ష

సంతనూతలపాడు(మద్దిపాడు), మే 12, ప్రభాతవార్త



మద్దిపాడు మండల పరిషత్‌కార్యాలయంలో మంగళవారం నాడు కిశోరి వికాసం సమ్మర్ స్పెషన్ ఆరోగ్య మేళాపై మండల స్థాయిలో డిప్యూటీ ఎంపీడీవో బి.హరి ప్రసాద్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. కిశోర బాలబాలికలను గ్రామ కమిటీ పర్యవేక్షణలో అందరూ చైతన్య పరచాలని డిప్యూటీ ఎంపీడీవో హరిప్రసాద్ ఈ సందర్భంగా కోరారు. మంచి పరివర్తన ద్వారా కిశోర బాలబాలికలు సమాజంలో మరింతగా ముందంజలో నిలవాలని డిప్యూటీ ఎంపీడీవో హరిప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో మద్దిపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మీ, ఎంఈఓ ఎం.శ్రీనివాసరావు, సీహెచ్ఓ రజిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి.పద్మావతి, జి.జ్యోతి, సీహెచ్ఎస్ నాగరాజులు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, కిశోర బాలబాలికలు , సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం స్వాధీనం

గిద్దలూరు, మే 12 ప్రభాతవార్త



మండలంలోని సంజీవరాయునిపేట గ్రామాని చెందిన యర్రంరెడ్డి రమణారెడ్డి వద్ద కర్ణాటక రాష్ట్రానికి చెందిన 5మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు గిద్దలూరు ఎక్సైజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎం జయరావు తెలిపారు. మంగళవారం తమ సిబ్బంది, మార్కాపురం ఈఎస్‌టిఎఫ్‌తో కలిసి దాడులు నిర్వహించగా యర్రంరెడ్డి రమణారెడ్డి వద్ద కర్ణాటకకు చెందిన 75ఎంఎల్ పరిమాణం గల 5 మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని అతనిమీద కేసు నమోదు చేశామని తెలిపారు. రమణారెడ్డిని అరెస్టు చేయవలసి ఉందని గిద్దలూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టరన జయరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ పోలీసులు, ఈఎస్‌టిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

## చేరెడ్డి వారి వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు, మే 12 ప్రభాతవార్త



మండలంలోని పొదలకుంట్ల పల్లె గ్రామంలో నివాసముంటున్న చేరెడ్డి బయ్యపురెడ్డి వారి ఇంట మంగళవారం జరిగిన వివాహ వేడుకలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. పొదలకుంటపల్లె గ్రామానికి చెందిన చేరెడ్డి బయ్యపురెడ్డి, ఈశ్వరమ్మ దంపతుల కుమారుని వివాహ వేడుకలో ఆయన పాల్గొని నూతన వధువరులైన దిలీప్ కుమార్ రెడ్డి, వెంకట నీరజలను ఆశీర్వదించారు. ఆయన వెంటగిద్దలూరు మండల టిడిపి నాయకులు, తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## శ్రీప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల నిధి ఆలయం వద్ద ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

సంతనూతలపాడు, మే 12, ప్రభాతవార్త



సంతనూతలపాడు మండలం గుమ్మళంపాడు సమీపంలోని నిధి వద్ద మంగళవారం నాడు శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి ఆలయంలో ఘనంగా హనుమత్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్వామి వాళ్లకు మన్యుసూక్త పూర్వక విశేష అభిషేకములు నిర్వహించారు. తదుపరి స్వామివారికి లక్ష తమలపాకులతో సామూహిక నాగవల్లి, అర్చన నిర్వహించారు. మన్యుసూక్త రుద్ర హోమములు, సుందరకాండ అరుణ పారాయణం, హనుమాన్ చాలీస్ భజన వలి వేడుకలు ఆలయ ప్రధాన అర్చకులు అన్నా వజ్జల శ్రీనివాసమూర్తి, సాయిశాండిల్య ఆధ్వర్యంలో పండితులు పిన్నెల్లి చంద్రశేఖర్ తదితరుల బృందంచే స్వామి వాళ్లకు పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అనంతరం తక్కెళ్ళపాటి రమేష్ ఆధ్వర్యంలో అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

## మండలంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

### - ఆంజనేయ స్వామి గుడిని ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల

రాచర్ల మే 12 ప్రభాతవార్త





మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు ఆకుపూజ, ప్రత్యేక పూజలు, నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని జేపీ చెరువు గ్రామంలో గ్రామానికి చెందిన కళారత్న పత్తి ఓబులయ్య, వారి కుటుంబ సభ్యులు, దాతలు, గ్రామ ప్రజల సహకారంతో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి గుడిని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు టిడిపి నాయకులు, స్థానిక ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కటిక యోగానంద్, రంగస్వామి దేవస్థానం చైర్మన్ సిద్ధం నరసింహులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మేకల తిరుపాల్, స్థానిక నాయకులు బొల్లవరం ఆదినారాయణ, కన్నసాని గోపాలరావు, తురిమెళ్ళ రవికుమార్, పుట్టా బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా హనుమత్ జయంతి ఉత్సవాలు

సంతనూతలపాడు, మే 12, ప్రభాతవార్త



సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పరిధిలోని పాలకేంద్రం వద్ద గల ఆంజనేయస్వామికి మంగళవారం నాడు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా హనుమత్ జయంతి మహోత్సవ వేడుకలు నిర్వహించారు. తొలుత సాంప్రదాయకంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను సన్నిదానంలోకి తీసుకొచ్చిన తదుపరి పూజలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి ఈమని బలరాం ఈ వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ హనుమంతుని గొప్పతనాన్ని గురించి వివరించారు. హిందువుల ఐక్యత వలన దేశం బలోపేతం అవుతుందన్నారు. సంస్కృతి ఇలాంటి పండుగల్లో బతికిఉందన్నారు. దానిని కాపాడుకోవాల్సి న బాధ్యత అందరిపై కలదన్నారు. అనంతరం స్వామివారి ఉత్స వ విగ్రహంతో సుమారు 200 మోటారు సైకిళ్లతో ర్యాలీగా ప్రారంభమై సమతనగర్ నుండి పేర్నమిట్టలో అన్ని వీధుల్లో కొనసాగించారు. తదుపరి అన్నసంతర్పణ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సుమారు 5 వేలకు మందికి పైగా అన్నదాన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు జేసు రాంబాబు, రావూరి శ్రీనివాసరెడ్డి, మిడసల మహేంద్ర పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సంఘ నాయకులు ఎస్.కృష్ణయ్య, వై.వీరశేఖర్‌రెడ్డి, వై.రాజు, వై.నిరంజన్, ఆకుల శ్రీను, బలిజేపల్లి సుబ్బారెడ్డి, బండి భాను, టి.వెంకటేశ్వర్లు, వి.నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఒక పండుగ వాతావరణంలో ఈ వేడుకలు జరిగాయి.

# పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

### - 10 మంది అరెస్ట్ రూ.65 వేల నగదు - 10 సెల్‌ఫోన్లు స్వాధీనం

సింగరాయకొండ, మే 12,ప్రభాతవార్త



మండల పరిధిలోని సోమరాజుంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ ఘటనలో 10 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.65 వేల నగదు, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా టాస్క్‌ఫోర్స్ బృందం ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. అందిన సమాచారం మేరకు ఇంచార్జి సీఐ భీమా నాయక్ పర్యవేక్షణలో ఎస్సై చెంచయ్యతో కలిసి పోలీసులు దాడి నిర్వహించారు.పేకాట ఆడుతున్న 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జూదం, గంజాయి, డ్రగ్స్ రవాణా వంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే డయల్ 112 లేదా 9121102266కు తెలియజేయాలని అధికారులు కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# టీడీపీ కార్యకర్త వలీమా వేడుకలో ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, మే 12, ప్రభాతవార్త



కనిగిరి పట్టణంలోని 3వ వార్డు శంఖవరం గ్రామంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త షేక్ నాయబ్ రసూల్ వలీమా వేడుకలో కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు షేక్ జాఫర్- ఖాశింబి దంపతుల కుమారుడు షేక్ నాయబ్ రసూల్ వలీమా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఉగ్ర వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబసభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆనందంలో భాగమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఉగ్రకు ఘన స్వాగతం పలికారు. ప్రజలతో కలిసిమెలిసిఉండటం, కార్యకర్తల కుటుంబ కార్యక్రమాలకు హాజరవుతూ ఆత్మీయత చాటుకోవడం ఎమ్మెల్యే ఉగ్ర ప్రత్యేకత అని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి పట్టణ టీడీపీ నాయకులు షేక్ ఫిరోజ్, మాజీ కౌన్సిలర్ బుల్లా బాలబాబు, షేక్ జాఫర్, శ్రీనివాస్‌రెడ్డి, జిలాని, కాశీం, అంజి తదితరులు పాల్గొన్నారు.

## దర్శి రోటరీక్లబ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరెడ్డి పుట్టిన రోజు వేడుకలు

### - 100 మంది నిరుపేదలకు సరుకులు పంపిణీ

### - పారిశుధ్య కార్మికులకు బియ్యం పంపిణీ

దర్శి, మే 12, ప్రభాతవార్త





సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రజల అభిమానం పొందుతున్న యువ వ్యాపార వేత్త, రోటరీ క్లబ్ ఆఫ్ దర్శి ప్రెసిడెంట్ బోయిళ్ల నాగేశ్వర్‌రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా ఆదర్శప్రాయమైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలు, అవసరమైన వారికి కలిపి సుమారు 100 మందికినిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు 25 కేజీల బియ్యం, కంది పప్పు, ఆయిల్ ప్యాకెట్లు, ఉల్లిపాయలు నిత్యవసర సరుకులు అందజేశారు. అదనంగా వికలాంగుల సౌకర్యార్థం రెండు ట్రై సైకిళ్లను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై వారు పాల్గొని కార్యక్రమాన్ని అభినందించారు. సమాజ సేవే నిజమైన సేవ అని, ఇలాంటి కార్యక్రమాలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బోయల్ల నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పుట్టిన రోజు వేడుకలను ఆర్భాటాలకు పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా నిర్వహించడం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, రోటరీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సాగుకు సమాయత్తంకండి

### - ఎరువులను ఎమ్మార్పీ ధరలకే అమ్మాలి - అక్రమాలకు పాల్పడితే లైసెన్సులు రద్దు !

### - జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

కందుకూరు మే 12, ప్రభాతవార్త



ఈ ఏడాది ఖరీఫ్‌సాగుకు సమాయత్తం కావాలనిప్రకాశం జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు వ్యవసాయాదికారులు కు సూచించారు. అదేవిదంగా రైతులును సైతం సమాయత్తపరచాలన్నారు. మంగళవారం కందుకూరులో డివిజన్ లోని కందుకూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం, ఉలవపాడు, గుడ్లూరు మండల వ్యవసాయఅధికారులు ఎరువులషాపుల డీలర్లుతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జీ వ్యవసాయ సహాయసంచాలకులు శేషారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజనుకు అవసరమైన ఎరువులను, విత్తనాలను, పురుగు మందులును సంసిద్దంగా ఉంచుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లో కొరతరానివ్వొద్దన్నారు. అదేవిధంగా ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విక్రయాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఆయన సూచించారు. ఇందుకు విరుద్దంగా అక్రమాలకు పాల్పడితే లైసెన్సులు రద్దుచేస్తామని ఆయన హెచ్చరించారు. క్రయవిక్రయాల వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. రికార్డులకు వాస్తవనిల్వలతో సరిపడాలన్నారు. లేకపోతే ఇబ్బందిపడతారని ఆయన వివరించారు. అంతేకాకుండా అనుమతిపత్రాలు అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

**రైతులకు సూచనలు :**

సాంకేతిక వ్యవసాయాధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ విత్తనాలు, పురుగుమందులు లేదా ఎరువుల కొనుగోలుకు సంబందించిన రశీదు, విత్తనప్యాకెట్‌లు పంటపూర్తయ్యేవరకు అందుబాటులో ఉంచుకోవాలని రైతులకు సూచించారు. విత్తనాల నాణ్యతాప్రమాణాలను పరిశీలించాలన్నారు. ఇందుకోసం మొలక శాతం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలన్నారు. ధరల వివరాలతోపాటు లైసెన్సు వివరాల బోర్డులను అందుబాటులో ఉంచాలన్నారు. ఏపీఏఎంఎస్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.రత్నమంజుల, ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ మాలకొండయ్యలు మాట్లాడుతూ యూరియా, డీఏపీల అదికవినియోగం వలన భూమి సమతుల్యత దెబ్బతింటుందన్నారు. చౌడు భూములవుతాయన్నారు. పచ్చిరొట్ట మరియు జీవన ఎరువులను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు షేక్ అబ్దుల్ రహీం, బి.రవికుమార్, డి.విజయ్ కుమార్, ఆదినారాయణ టెక్నికల్ ఏవో జీ.మధు, భూసార పరీక్ష కేంద్రంఏవోలు సిహెచ్.వి.ఎల్.దుర్గ, వి.గీతా ప్రకాష్, ఏడీ ఆఫీస్ సూపరింటెండెంటు ఎం శ్రీనివాసులు, ఏఈఓలు మరియు ఐదు మండలాల ఇన్పుట్ డీలర్స్ పాల్గొన్నారు.

# కందుకూరులో అరకు వ్యాలీ కాఫీ షాప్

### - మెప్మా ఆధ్వర్యంలో ఎమ్మెల్యేచే ప్రారంభం

కందుకూరు మే 12, ప్రభాతవార్త





మహిళా సాధికారితే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఇందులో బాగంగానే ప్రసిద్దిగాంచిన గిరిజన ఉత్పత్తులతో కూడిన 'అరకువ్యాలీ కాఫీ' షాపును కందుకూరులో పొదుపు మహిళలకు కేటాయించినట్లు తెలిపారు. మునిసిపల్ కమీషనర్ అనూషా సారధ్యంలో మెప్మా సీఎంఎం ఫణికుమారి నేతృత్వంలో అరకువ్యాలీ ఉత్పత్తుల షాపును లక్ష్మీతిరుపతమ్మతల్లి పొదుపు గ్రూపుకు కేటాయించారు. ఈ షాపును మంగళవారం ప్రకాశం జిల్లా మెప్మా పీడీ విజయలక్ష్మి మరియు మునిసిపల్ కమీషనర్ అనూషాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతాప్రమాణాలతో కూడిన గిరిజన సహకార సంస్థ ఉత్పత్తుల వినియోగంతో మహిళల జీవనోపాధితోపాటు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు ఉందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. తద్వారా మరి కొంతమందికి ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఆయన గిరిజన ఉత్తత్తుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. షాపింగ్ చేశారు.

**త్వరలో తృప్తి క్యాంటీన్ :**

ప్రకాశం జిల్లా మెప్మా ప్రాజక్టు డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో ఈ 'అరకువ్యాలీ కాఫీషాప్‌ను' పొదుపు మహిళలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిని ప్రకాశం జిల్లాలోనే మొదటగా కందుకూరులో ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇందుకు అనువైన స్థలంకేటాయించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావుతోపాటు మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలన్నారు. అదేవిధంగా ఇక్కడే తృప్తిక్యాంటీన్ ఏర్పాటును పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు మహిళలు ముందుకు రావాలని సూచించారు. కమీషనర్ అనూషా మాట్లాడుతూ మహిళాభివృద్ధి, సాదికారితకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఇందులో బాగంగానే పొదుపు లీడరు మాదాల లక్ష్మీతోపాటు పలువురికి జీవనోపాధికలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం ఫణికుమారి, ఆర్‌పీలు కామాక్షి, ప్రియాంక, రజనీ, డీఈవో పద్మజపాటు పలువురు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, మాదాల మాల్యాద్రి, సామినేని కొండలరావు, మాదాల రవీంద్ర, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు అల్లం వెంకటేశ్వర్లు, అన్న క్యాంటీన్ చైర్మన్ ఉన్నం కొండలరావు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కార్యనిర్వాహ కార్యదర్శి షేక్ రూబీతోపాటు పలువురు పార్టీ నాయకులు,

## శోభాయమానంగా హనుమాన్ జయంతి వేడుకలు

### - జైశ్రీరామ్ జై ఆంజనేయం అంటూ భక్తుల నినాదాలతో మార్మోగిపోయిన పామూరు పట్టణం

### - భారి బందోబస్తు ఏర్పాటు చేసిన సీఐ వినోద్‌కుమార్

పామూరు, మే 12, ప్రభాతవార్త





హనుమాన్ జయంతి శోభాయాత్ర పామూరు పట్టణంలో మంగళవారం నాడు దిగ్విజయంగా కొనసాగింది. విశ్వహిందూ పరిషత్ బజరంగదల్ వివిధ హిందూ కులాలకు చెందిన వారు భారీ సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. స్థానిక మదన వేణుగోపాల స్వామి దేవస్థానం వద్ద నుండి ఆంజనేయస్వామి భారీ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్ ద్వారా స్థానిక తూర్పు వీధి భగత్ సింగ్ నగర్ అంకాలమ్మ వీధి నెల్లూరు రోడ్డు పేట బజార్ సీఎస్‌పురం రోడ్డు మమ్మీ డాడీ సెంటర్ కనిగిరి రోడ్డు నుండి భాణాసంచాలు, కనకతప్పెట్లు మేళతాళాలతో వేలాది మంది భక్తు జన సంద్రంతో శోభాయాత్ర ప్రశాంతంగా జరిగింది. హనుమాన్ జయంతి సందర్భంగా వేణుగోపాల స్వామి దేవస్థానం వద్ద బజరంగల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు, జమకాల నరేష్, కొండిశెట్టి వెంకటరమణయ్య, కాబోలు శివ వరద ఓబులేసు, యాట వీరస్వామి, ఒగురి ఏడుకొండలు, దేవస్థానం మాజీ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, జమకాల ఓబులేసు, తదితరుల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్విఘ్నంగా కొనసాగింది. పామూరు సీఐ వినోద్ కుమార్ ఎస్సై కట్టా అనూక్ వెలిగండ్ల ఎస్సై కృష్ణపావని శోభాయాత్రలో ఎటువంటి అపశృతి జరగకుండా పటిష్టంగా బందోబస్తు నిర్వహించారు.

## ఉద్యానవన పంటల రక్షణలో ఆధునిక ఫెన్సింగ్ విధానం

### - దర్శి ఉద్యానశాఖ అధికారి ఎం.రవి వెంకన్నబాబు

ముండ్లమూరు, మే 12, ప్రభాతవార్త



ఉద్యానవన పంటల సంరక్షణ, అడవి జంతువులు, పశువులు నుండి పంటల రక్షించుకుంది పసుపుగల్లు పంచాయతీ చింతలపూడి గ్రామానికి చెందిన ఎస్సీ రైతులు ఉద్యానవనశాఖ ద్వారా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ తీగలను ఏర్పాటు చేసినందున క్షేత్రస్థాయిలో పరిశీలన కొరకు దర్శి ఉద్యానవన శాఖ అధికారి ఎం.రవివెంకన్న బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ విధానం, పంటల భద్రతకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్సు సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఎస్సీ రైతులు దాసరి చిన్న అంజయ్య, కోటయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

# నీట్ లికేజి మాఫియాపై కఠిన చర్యలు చేపట్టాలి

## - యంపీజే రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్ డిమాండ్



**మార్కాపురం టౌన్, మే 12, ప్రభాతవార్త**

కేంద్రంలోని బిజెపి డబుల్ సర్కారు అయిన రాజస్థాన్‌లోని కోటాలో నీట్ పరిక్ష పేపర్‌లు లీకేజి జరగడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అని మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో ఎన్‌టిఎ ద్వంద్వ ప్రమాణాలతో దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. ఎంతో నిష్ఠ, క్రమశిక్షణతో కష్టపడి చదువుతున్న విద్యార్థులకు ఈ లీకేజి వ్యవహారం నష్టం జరిగిందన్నారు. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎంతో ఆవేదన వ్యక్తంచేస్తున్నారన్నారు. ఎన్డీఎ గత పదేళ్ళ పాలనలో ఎన్‌టిఎ ఆద్వర్యంలో జరిగిన పరిక్షలలో చాలా సార్లు లీకేజిలు జరుగుతున్న కఠిన చర్యలు తీసుకోకపోవడం వలన ఎన్‌టిఎ అసమర్థత మరింత ఎక్కువైందని అబ్దుల్ రజాక్ ఎద్దేవా చేశారు. నిబంధనల పేరిట నీట్ అభ్యర్థులను వేధించడంలో ఉన్న శ్రద్ధ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడంలో ఎన్‌టిఎ చూపించలేక పోవడం దుర్మార్గమన్నారు. తాత్కాలిక ఉపశమనం కొరకు లీకేజి వ్యవహారంలో కేంద్రం సిబిఐ ఎంక్వైరీ వేయడమేనన్నారు. లీకేజి వల్ల విద్యార్థుల శ్రమ, సమయం, భవిష్యత్తు, జీవితాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. వెంటనే దీనికి భాధ్యులైన వారినికఠినంగా శిక్షించి, ఎన్‌టిఎను పూర్తిగా ప్రక్షాళన చేసి, మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పూర్తి జాగ్రత్తలు చేపట్టాలని షేక్ అబ్దుల్ రజాక్ డిమాండ్ చేశారు.

# సైబర్ నేరాల పట్ల యువత జాగ్రత్త వహించాలి

## - రూరల్ ఎస్సై వేమన



**మార్కాపురం టౌన్, మే 12, ప్రభాతవార్త**

సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ముఖ్యంగా యువత జాగ్రత్త వహించాలని మార్కాపురం రూరల్ ఎస్సై వేమన సూచించారు. స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జ్ అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో 34 ఆంధ్ర బెటాలియన్ నేతృత్వంలో నిర్వహిస్తున్న 13వ వార్షిక ఎన్‌సీసీ శిక్షణ శిబిరం (ఏటిసి13)లో భాగంగా మంగళవారం సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి 34 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మోహన్ వి కమాండెంట్‌గా, లెఫ్టినెంట్ కల్నల్ దినేష్ ఎస్.ఎం డిప్యూటీ కమాండెంట్‌గా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ ఎస్సై వేమన, ఎన్‌సీసీ క్యాడెట్లకు సైబర్ నేరాల రూపాలు, వాటి నుంచి రక్షణ మార్గాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో మోసాలు, ఫిషింగ్, ఆన్‌లైన్ ఫ్రాడ్‌లు పెరుగుతున్నాయని, వ్యక్తిగత సమాచారాన్ని రహస్యంగా ఉంచుకోవడం అత్యంత అవసరమని సూచించారు. అనుమానాస్పద లింకులు, కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియా వినియోగంలో నియంత్రణ పాటించాలని క్యాడెట్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమం అనంతరం ఎస్సై వేమనను కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ మోహన్ వి, డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ దినేష్ ఎస్.ఎం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్ సోమేశ్ యం, కళాశాల ఏఎన్ఓ క్యాప్ అనిల్, పీఐ సిబ్బంది మరియు ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలో తిరోగమనం

## - మోదీ పాలనలో దేశ పురోగమనం

## - బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



**మార్కాపురం, మే 12,ప్రభాతవార్త**

సుదీర్ఘ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశం ఆర్థికంగా వెనుకబడిపోయిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ వేగంగా ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. ప్రధాని మోదీ సూచించిన బంగారం కొనుగోలు నియంత్రణ, ఇంధన పొదుపు వంటి అంశాలను కాంగ్రెస్ పార్టీ విమర్శించే ముందు గతంలో తమ ప్రభుత్వాలు అనుసరించిన విధానాలను ప్రజలకు గుర్తు చేసుకోవాలని ఆయన సూచించారు. 2013లో అప్పటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశ ప్రజలను బంగారం కొనుగోళ్లు తగ్గించుకోవాలని, పెట్రోలియం ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలని కోరిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అప్పటి ఆర్థిక పరిస్థితులు కాంగ్రెస్ పాలనలో దేశం ఎంత బలహీనంగా మారిందో స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ హయాంలో కూడా ప్రజల అవసరాలను తగ్గించుకోవాల్సిన పరిస్థితులు తీసుకువచ్చారని విమర్శించారు. మోదీ ప్రభుత్వ హయాంలో మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ ఇండియా, విదేశీ పెట్టుబడుల ఆకర్షణ, స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం, ఇంధన రంగ సంస్కరణలు వంటి కీలక నిర్ణయాలతో దేశం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందన్నారు. భారత్ ప్రస్తుతం భారీ స్థాయిలో బంగారం, క్రూడ్ ఆయిల్ దిగుమతులపై ఆధారపడుతున్న నేపథ్యంలో వాటి డిమాండ్ పెరిగితే రూపాయి విలువపై ప్రభావం పడే అవకాశం ఉందని చెప్పారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రధాని మోదీ దేశ ప్రయోజనాల కోసమే బాధ్యతాయుత సూచనలు చేస్తున్నారని తెలిపారు.దేశ ఆర్థిక ప్రయోజనాల విషయంలో ప్రజలు కూడా విజ్ఞతతో ఆలోచించాలని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కోరారు.

# చెట్లు పెరిగి అడవిలా మారిన తీగలేరు వాగు కాలువ..?

## - ఈ కాలువపై అయినముక్కల వద్ద బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం ఎప్పుడో..?





**పెద్దదోర్నాల, మే 12, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం నియోజకవర్గ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సమస్యలకు ఇంకా పరిష్కారం కనిపించడం లేదు. వెలుగొండ ప్రాజెక్టులో కీలకమైన తీగలేరు కాలువ కర్నూలు- గుంటూరు జాతీయ రహదారి అయినముక్కల వద్ద బ్రిడ్జి నిర్మాణం పనులు ఎప్పుడు చేపడతారో తెలియని పరిస్థితి నెలకొంది. తీగలేరు కాలువ పూర్తిగా నిర్లక్ష్యానికి గురై చెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది.తీగలేరు కాలువ ద్వారా దోర్నాల మీదుగా యర్రగొండపాలెం పుల్లలచెరువు వరకు వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే కాలువ పనులు అక్కడక్కడ మధ్యలో నిలిచిపోవడం, కాలువకు అడ్డంగా ఉన్న రోడ్లపై బ్రిడ్జిలు నిర్మించకపోవడం రైతుల ఆశలు అవిరవుతున్నాయి. కాలువలో ఎక్కడ చూసినా ముళ్ళచెట్లు, పొదలు పెరగడం చూస్తుంటే కాలువ నిర్మాణం చమర్చిపోయారా లేక వదిలేశారా అనే సందేహం ప్రజల్లో రైతులలో ఉంది. తీగలేరు కాలువపై అయినముక్కల వద్ద కర్నూలు- గుంటూరు జాతీయ రహదారి పై వంతెన నిర్మాణం జరగనిదే చుక్క నీళ్లు యర్రగొండపాలెం పుల్లలచెరువు వెళ్ళవు అనేది బహిరంగ రహస్యమే. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయిన తీగలేరు కాలువపై బ్రిడ్జి నిర్మాణం జరగనిదే పుల్లలచెరువుకు వెలిగొండ ప్రాజెక్టు నీళ్లు వెళ్ళవు. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం జరగాలంటే కనీసం ఆరు నెలలు పడుతుంది. ఇంకా ఎక్కువ సమయం పట్టినా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు. ప్రతి రోజు ఈ మార్గమున అధికారులు వెలుగొండ ప్రాజెక్టు వద్దకు వెళ్తూనే ఉంటారు. మరి తీగలేరు కాలువను ఎందుకు చూడరో, తీగలేరు కాలువ పనులు చేపట్టిన ఏజెన్సీ సంస్థలను ఎందుకు అడిగి చేయించారో ఇక్కడి రైతులకు అర్థంకాక నిస్సహాయ స్థితిలో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి తీగలేరు కాలువపై అయినముక్కల వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

# శ్రీరామదూత క్షేత్రంలో మాజీ ఎమ్మెల్యే అన్నా ప్రత్యేక పూజలు



**కొనకనమిట్ల, మే 12, ప్రభాతవార్త**

కొనకనమిట్ల- పుట్లూరువారిపల్లె కూడలి లోని శ్రీరామ దూత క్షేత్రంలో జరుగుతున్న సప్తాహ ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు అకలంకం వెంకట రామ కృష్ణమాచార్యులు మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన మురళీకృష్ణ, మండల వైకాపా కన్వీనర్ మోర శంకర్‌రెడ్డి, జడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులు, నాయకులు ఎక్కంటి తిరుపతిరెడ్డి, పి.వెంకటేశ్వరరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించిన బోయళ్ళ



**సీఎస్‌పురం, మే 12, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన సీఎస్‌పురం పామూరు రోడ్డు నందు ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి సందర్భంగా టీడీపీ నాయకులు మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయళ్ళ నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోకల మాల్యాద్రి, కనిగిరి ఏఎంసీ మాజీ డైరక్టర్ తోట రవి, జర్నలిస్టు ఎస్పీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం వార్త



# వైభవంగా శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు



**కొనకనమిట్ల, మే 12, ప్రభాతవార్త**

మండల కేంద్రం కొనకనమిట్ల- పుట్లూరివారి పల్లె కూడలిలోని శ్రీరామదూతక్షేత్రంలో శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. ఈ నెల 5వ తేదీ నుంచి ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీరామనామ భజన కార్యక్రమం దొనకొండ మండలం ఆవరల్లిపాడు భజన బృందం సభ్యులచే నిర్వహించారు. వేద పండితులు శ్రీరామదూత ధార్మిక ట్రస్టు వ్యవస్థాపకులు అకలంకం వెంకటరామకృష్ణ మాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమంలో నిర్వహించారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారికి ఆకుపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం పుట్లూరివారిపల్లె గ్రామస్తులచే భారీగా అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి శ్రీ నటరాజ కళామండలి కొనకనమిట్ల వారిచే నృత్య కోలాటం నిర్వహించారు.

**గొట్లగట్టులో :**

మండలంలోని గొట్లగట్టు శ్రీ అభయ వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆకుపూజ హోమాలు నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

# అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



**తాళ్లూరు, మే 12,ప్రభాతవార్త**

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకునే అంజనీసుతుడికి ప్రీతికరంగా భావించే హనుమాన్ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలో పలు గ్రామాల్లో ఆంజేయస్వామి దేవాలయాలు సుందరంగా మామిడి ఆకులు,పచ్చని పందిళ్లతో అలంకరించారు. తూర్పు గంగవరం, సోమవరప్పాడు,బెల్లం కొండవారిపాలెం,లక్కవరం తదితర గ్రామాలో శ్రీఆంజనేయస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. తూర్పుగంగవరంలో పడమరబజారు అంజనేయస్వామి ఆలయం లో అర్చకులు నారాయణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష అభిషేకాలు, ఆకు పూజలు నిర్వహించిన అనంతరం పట్టుపట్టువస్త్రాలు ,నిమ్మకాయలు ,తమలపాకులు, పూలమాలలతో అలంంకరించారు.ఆతర్వాత హారతి, మంత్రపుష్పం ,తీర్థప్రసాదం వితరణ చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. మొక్కుబడులు ఉన్న భక్తులు స్వామికి వడపప్పు,పానకం సమర్పించారు. భక్తులకు వడపప్పు,పానకం పంపిణీ చేశారు. ఆలయాల ప్రాంగణంలో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

# ఊరంతా కాషాయమయం

## - ఎటు చూసినా కాషాయ జెండాల రెపరెపలు

## - మార్మోగిన జై శ్రీరామ్ - అంజనీపుత్ర ఆంజనేయ నినాదాలు

## - వేలాది భక్తులతో అంగరంగ వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



**మార్కాపురం, మే 12,ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణం మంగళవారం భక్తి పారవశ్యంతో కాషాయమయంగా మారింది. ఎటు చూసినా కాషాయ జెండాల రెపరెపలు, జై శ్రీరామ్ – అంజనీపుత్ర ఆంజనేయ" నినాదాలతో పట్టణం మార్మోగిపోయింది. మంగళ వాయిద్యాలు , భజనలు, కోలాటాలు, సాంస్కృతిక నృత్యాల నడుమ హనుమాన్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని చాటిచెప్పారు. తర్లుపాడు రోడ్డు పార్కు సమీపంలోని పెద్ద ట్యాంక్ పక్కన గల శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి టెంకాయ కొట్టి శోభాయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ ఇమ్మడి కాశీనాథ్, వక్కలగడ్డ మల్లికార్జున్, తాళ్లపల్లి సత్యనారాయణ, కందుల రామిరెడ్డి,పి.వి. కృష్ణారావు, రామాలయల నిర్వహణ కమిటీ సభ్యులు, హనుమాన్ శోభాయాత్ర నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.శోభాయాత్రలో చిన్నారులు, మహిళలు విశేషంగా ఆకట్టుకున్నారు. భక్తి గీతాలు,రామ కీర్తనలు,భజనలు, కోలాటాలతో భక్తిరసాన్ని పంచారు. భాజా భజంత్రీల మంగళ వాయిద్యాలు, బైకులు, కార్ల ర్యాలీలతో పట్టణ వీధులు దద్దరిల్లాయి.ఆర్టీసీ బస్టాండ్, కంబం బస్టాండ్, రీడింగ్ రూమ్, మార్కెట్ సెంటర్, దోర్నాల బస్టాండ్, నాయుడువీధి, నాలుగు మాడ వీధులు, కాలేజీ రోడ్డు, సప్తగిరి ప్రాంతాల గుండా శోభాయాత్ర కొనసాగింది. కర్రసాములు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.పగిడీ తలపాగాలతో యువకులు, ప్రత్యేక అలంకరణలతో పాల్గొన్న భక్తులు ఆకట్టుకోగా, చిన్నారులు బాలాంజనేయుడు, బాలరాముడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, సీతాదేవి వేషధారణలో దర్శనమిచ్చి భక్తులను మంత్ర ముగ్ధులను చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రజలు భక్తి భావంతో ఐక్యంగా పాల్గొనడం ఆనందదాయకమని పేర్కొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో,డీఎస్పీ యూ.నాగరాజు పర్యవేక్షణలో,సీఐ అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎస్ఐలు అహరోన్, వేమన, సైదు బాబు తదితర పోలీసు సిబ్బంది ట్రాఫిక్ నియంత్రణ చేపట్టి శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించారు.









# పాపిరెడ్డిపల్లిలో జలధార - జలహారతి కార్యక్రమం



**వెలిగండ్ల, మే12, ప్రభాతవార్త**

మండలంలోని కంకణంపాడు పంచాయతీ పాపిరెడ్డిపల్లి గ్రామంలో జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి ఆధ్వర్యంలో జలధార – జలహారతి కార్యక్రమం జరిగింది.ఈ కారక్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షులు కేసరి రమణారెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు మేడం మహేష్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు నాగూర్ యాదవ్, చెంచిరెడ్డి, పుల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఏపీవో నాయక్, ఈసీ కోటిరెడ్డి, టీఏ శేఖర్, ఎఫ్‌ఏ ప్రతాప్, నియోజకవర్గం ఐటీడీపీ అధ్యక్షుడు నల్లబోతుల నాగరాజు, కంకణంపాడు ఐటీడీపీ కోఆర్డినేటర్ నాసర్ వలి, నరేంద్ర, అద్దంకి నారాయణ, మాల్యాద్రి, కంకణంపాడు పంచాయతీ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో నర్సుల సేవలు మరువలేనివి

## - పెద్దదోర్నాల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



**పెద్దదోర్నాల, మే12, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన పెద్దదోర్నాల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కలిసి నర్సింగ్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నర్సులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, రోగులకు వైద్య సేవలు అందించే క్రమంలో రాత్రింబవళ్లు అంకితభావంతో పని చేసి వైద్య రంగానికి వెన్నెముకలా నిలుస్తున్నారని వైద్యులు పేర్కొన్నారు. రోగుల పట్ల ప్రేమ, సహనము, సేవాభావంతో పని చేయడం నర్సుల గొప్పతనం అని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి సేవలందించిన నర్సుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరువలేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు, నర్సులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి సవిత చేతుల మీదుగా అవార్డు అందుకున్న బీసీ హాస్టల్ విద్యార్థి జస్వంత్‌రెడ్డి



**లింగసముద్రం, మే 12, ప్రభాతవార్త**

ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 572 మార్కులతో సత్తా చాటిన లింగసముద్రంలోని బీసీ బాలుర వసతి గృహం విద్యార్థి కల్లూరి జస్వంత్ రెడ్డిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అభినందించారు. మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 10వ తరగతిలో సత్తా చాటిన హాస్టల్ విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సవిత ప్రకాశంజిల్లా స్థాయిలో 10వ తరగతి పరీక్షా ఫలితాలలో బీసీ హాస్టల్ విద్యార్థులలో ద్వితీయ స్థానంలో నిలిచిన కల్లూరి జస్వంత్‌రెడ్డిని అభినందించి నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం, షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరక్టర్ మల్లిఖార్జున, జిల్లా బీసీ సంక్షేమ శాఖ నిర్మలాజ్యోతి, కందుకూరు సహాయ సంక్షేమ శాఖ అధికారి షేక్ జబ్బార్, లింగసముద్రం బీసీ హాస్టల్ వార్డెన్ వాకా మాల్యాద్రి పాల్గొన్నారు.

# వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



**కందుకూరు మే 12, ప్రభాతవార్త**

హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కందుకూరు పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. శ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయం పక్కన ఉన్న బజరంగీ సర్కిల్ వద్ద నుంచి కందుకూరు ఆర్ఎస్ఎస్ ఖండా సంఘ చాలక్ వరకు డాక్టర్ తన్నీరు మల్లికార్జున్‌రావు, బజరంగీ సర్కిల్ నిర్వాహకులు కళ్యాణ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.పలువురు హిందూ బంధువులతో పోస్ట్ ఆఫీస్ సెంటర్, అంబేద్కర్ సర్కిల్, పొట్టి శ్రీరాములు బజారు మీదుగా, గుర్రం వారి పాలెం ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా చాకలిపాలెం హనుమాన్ విగ్రహం వరకు ఈ శోభాయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో కందుకూరు బిజెపి కన్వీనర్ గట్టమనేని హరిబాబు, బిజెపి నాయకులు, హిందూ బంధువులు,యువత ఉత్సాహంగా నాట్యాలు చేస్తూ పాల్గొన్నారు.

# చక్కెర వ్యాధితో కూతురు, కొడుకు ఇద్దరు కోమాలోకి

## - ఈ ఘటనతో ఆ కుటుంబం తీవ్ర ఆవేదన - ఆదుకోవాలని వేడుకోలు





**యర్రగొండపాలెం, మే 12, ప్రభాతవార్త**

కూతురు, కుమారుడు పడుతున్న బాధను తట్టుకోలేక ఆ తల్లి తండ్రుల వేదన వర్ణణాతీతం. కూతురు ఆసుపత్రిలో పడుతున్న హృధయ విచారకమైన రోధన చూసిన ఆ తల్లి తండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం మండలం వీరభద్రాపురం గ్రామానికి చెందిన మగినం ఇజ్రాయెల్, నాగమ్మ దంపతులు చెరుకు కోతలే చెరుకు కోతలే ఆదరువుగా జీవనం సాగిస్తున్నారు. ఈ దంపతులకు 5గురు సంతానం. ఐదుగురిలో ఇద్దరికి చక్కెర వ్యాధి చుట్టేసిన పరిస్థితి. మగిన భారతి(11), మగినం సిద్దు(13) వీరద్దరికి చిరు ప్రాయంలోనే చక్కెర వ్యాధి సోకింది. వీరిది కడు పేరిక కుటుంబం చెరుకు కోతలు, మిర్చి కోతలకు ముఠాకట్టి వలస వెళ్ళి జీవించడం వీరి జీవనోపాదిలో ఓ భాగం. కూలీ నాలీ చేసి తెచ్చుకుంటేనే తినాలి లేదంటే పస్తులే. అలాంటి కుటుంబంలో ఇద్దరు పిల్లలకు చక్కెర వ్యాధి సోకడంతో వైద్యం చేయించుకోలేక సరైన వైద్యం అందకపోవడంతో ఆ వ్యాధి రోజు రోజుకు తీవ్రరూపం దాల్చి కూతురు భారతి(11) పాప కంటి చూపు మందగించి రెండుకళ్ళు పూర్తిగా కనపడని పరిస్థితి. అదే విధంగా కుమారుడు సిద్దు(13) కాళ్ళు సచ్చుపడిపోయి ఒంటికి రెంటికి అన్ని అతనికి తెలియకుండానే చెడ్డిలోనే. ఆ వ్యాధితో ఆ ఇద్దరు పిల్లలు మంచం పట్టారు. ఇటీవల భారతి ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో స్థానిక రవీంద్ర వైద్యశాలకు తరలించారు. ఇక్కడ పరిస్థితి అనుకూలించకపోవడంతో చేతిలో చిల్లి గవ్వ లేకుండానే గుంటూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ అన్ని పరీక్షలను చేయిస్తుండగానే షుగర్ లెవల్స్ 1300 చేరి కోమాలోకి పోవడంతో వెంటనే ఆ పాపకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అదే విధంగా వారి కుమారుని పరిస్థితి కూడా అదే విధంగా ఉన్నట్లు తెలుస్తుంది. వీరిద్దరి వైద్య నిమిత్తం దాదాపు రూ.10లక్షలు ఖర్చు అవుతుందని బంధువులు చెబుతున్నారు. అంతటి ఖరిదైన వైద్యం చేయించుకునే ఆ స్థోమత ఆ పేద దంపతులకు లేదు. కానీ చూస్తూ చూస్తూ ఆ పిల్లలను వదల్లేక ప్రాణాలను కాపాడుకోవాలనే తపన ఆరాటంతో పోరాడుతున్నారు. దాతలు సహకరించాలని అర్జిస్తున్నారు. పాప, బాలుడి బంధువులు స్థానిక ముస్లిం యూత్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఇస్మాయిల్‌ను సంప్రదించి సొసైటీ తరుపున ఆదుకోవాలని కోరినట్లు తెలుస్తుంది.

# బీరు బాటిళ్ల కలకలం

## - నవ్వుల్లో మునిగిన జనం





**పెద్దదోర్నాల, మే 12, ప్రభాతవార్త**

దోర్నాల పట్టణంలో ఓ బ్రాంది షాపు దుకాణం నుండి ఓ వ్యక్తి చల్లని బీరు బాటిళ్లతో నిండిన సంచిని తీసుకెళ్తూ మధ్య రోడ్డుపై కింద పడేసుకోవడంతో నవ్వుల సందడి వెల్లివిరిసింది. వేసవి ఎండలు మండిపోతున్న వేళ సంచిలో నుండి బయటపడ్డ బీరు బాటిళ్లను చూసిన స్థానికులు ఇది ఫంక్షన్ కోసమేనా, లేక బెల్టు షాపుల కోసమా ? అంటూ సరదాగా వ్యాఖ్యలు చేస్తూ నవ్వుకున్నారు. ఈ సంఘటన దోర్నాల పట్టణంలోని శ్రీశైలం రోడ్డు హైవే జంక్షన్ వద్ద మంగళవారం జరిగింది. సంచిలో రెండు అట్టపెట్టెల్లో నింపిన బీరు బాటిళ్ళు చేజారి కింద పడ్డాయి. కొన్ని పగిలిపోగా కొన్ని ఉన్నాయి. కొందరు వేసవి తాపం తీర్చే చల్లని బీరు కదా.. ఎక్సైజ్ పోలీసులు కూడా ఏమి చేస్తారులే ఎండలు ఇంతగా ఉన్నప్పుడు..! అంటూ చమత్కారాలు పేల్చారు. అయితే బాటిళ్ళ తీసుకు వెళ్తున్న వ్యక్తి మాత్రం ఏమి చేయాలో అర్థం కాక తడబడి పోయాడు. ఈ ఘటనను చూసిన పలువురు తమ సెల్‌ఫోన్‌లో షేర్ చేయడంతో దోర్నాల్లో ఈ సంఘటన హాట్ టాఫిక్‌గా మారింది. అక్రమంగా తీసుకెళ్లేటప్పుడు సక్రమంగా తీసుకెళ్లాలి కదా.. పడిపోయింది పగిలిపోయింది. అందరికి తెలిసిపోయింది. వేసవి వేళలో జరిగిన స్థానికులకు కాసేపు వినోదాన్ని పంచగా అక్కడ ఉన్న వారు నవ్వుల్లో మునిగిపోయారు.

# హాస్టల్‌లో మెరిట్ విద్యార్దులకు బహుమతుల



**కందుకూరు మే 12, ప్రభాతవార్త**

ప్రభుత్వ బిసి బాలికల హాస్టల్‌లో ఈ ఏడాది 10వ తరగతి పరీక్షా పలితాలలో ప్రధమ,ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్దులకు మంగళవారం విజయవాడలో ఘనంగ సన్మానించారు.కందుకూరు విద్యార్థులైన ఎస్.విద్య 588 మార్కులు,మరియు డి.జాహ్నవి ప్రియ 574 మార్కులు సాదించి జిల్లాలోనే ప్రధమద్వితీయస్దానాలు పొందారు.వీరిని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంత్రివర్యులు ఎస్.సబితా,ప్రిన్సిపల్ సెక్రటరి సత్యనారాయణ మరియు డైరెక్టర్ డాక్టర్ మల్లిఖార్జున,అడిషనల్ డైరెక్టర్ డీసిఎస్ రాజులచేతులమీదుగా ప్రసంసా పత్రాలు మరియు నగదు బహుమతి అందచేశారు. మొదటి ర్యాంక్ వారికి రూ.5 వేలు అందచేశారు.ఈ కార్యక్రమంలో డీబిసిడబ్యువోనిర్మలజ్యోతి,వార్డన్స్ జబ్బార్,కృశేనులు పాల్గొన్నారు.

8:8.qxd 5/13/2026 12:29 AM Page 1



## ప్రధాని మోదీ సూచించిన పది వినతులను ప్రజలు పాటించాలి

### - మల్లెల గోమ్స్



**కనిగిరి, మే 12, ప్రభాతవార్త**

దేశ అభివృద్ధిలో ప్రతి భారతీయుడు భాగస్వామి కావాలి దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు సూచించిన పది వినతులను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ప్రకాశం జిల్లా బీజేపీ యువమోర్చా జనరల్ సెక్రటరీ మల్లెల గోమ్స్ పిలుపునిచ్చారు. దేశ ఆర్థికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం, ఇంధన పొదుపు లక్ష్యంగా ప్రధాని మోడీ చేసిన సూచనలు దేశ భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా దిగుమతుల భారం, కాలుష్యాన్ని తగ్గించవచ్చని, విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. అలాగే మెట్రో రైళ్లు, ప్రజా రవాణా వ్యవస్థలను ఎక్కువగా ఉపయోగించడం ద్వారా ఇంధన ఆదా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వృథా ఖర్చులను తగ్గించుకోవడం, విదేశీ పర్యటనలకు బదులుగా దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని మల్లెల గోమ్స్ తెలిపారు. విదేశీ బంగారంపై ఆధారాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అదే విధంగా వంట నూనెల వినియోగంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అవసరమని అన్నారు. ఆన్‌లైన్ మీటింగ్‌లు, వర్క్‌ఫ్రమ్ హోమ్ వంటి విధానాలను వినియోగించడం ద్వారా సమయం, ఇంధనం ఆదా అవుతాయని తెలిపారు. విదేశీ మాదక ద్రవ్యాన్ని ఆదా చేయడం ప్రతి భారతీయుడి బాధ్యతగా భావించాలని, దేశ ప్రయోజనాల కోసం ప్రజలు తమ దైనందిన జీవితంలో ఈ పది వినతులను పాటించాలని మల్లెల గోమ్స్ పిలుపునిచ్చారు. దేశం కోసం మనం చేసే చిన్న చిన్న మార్పులే అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి బాటలు వేస్తాయని పేర్కొన్నారు.

## పేదల కంటి ఆరోగ్యానికి అండగా నిలిచిన ఉగ్ర

### - ఈ నెల 16న కంటి వైద్య శిబిరం, కళ్ళజోళ్ళ పంపిణీ



**కనిగిరి, మే 12, ప్రభాతవార్త**

కనిగిరి నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంక్షేమమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. పేదలు, వృద్ధులు కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జననీ చారిటబుల్ ట్రస్టు, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 16వ తేదీ శనివారం కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ఈ శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు పాల్గొని ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు చేయనున్నారని తెలిపారు. కంటి చూపు మందగించడం, మసక చూపు, కంటి నొప్పులు, ఇతర నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. శిబిరంలో అర్హులైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే ఉగ్ర పేర్కొన్నారు. అవసరమైన వారికి తదుపరి వైద్య చికిత్సలపై కూడా సూచనలు అందించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు, పేద కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఓటర్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు జెరాక్స్ ప్రతులతో పాటు కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్ తీసుకురావాలని నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి సంబంధించిన వివరాల కోసం 7382601555 నంబరును సంప్రదించాలని కోరారు.

## ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిపై ఎమ్మెల్యే ఉగ్ర సమీక్ష

### - ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం





**కనిగిరి, మే 12, ప్రభాతవార్త**

కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ(హెచ్‌డీఎస్) సమావేశంలో కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మంగళవారం పాల్గొన్నారు. ఆసుపత్రి అభివృద్ధితో పాటు ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ప్రస్తుతం అందుతున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అవసరమైన మౌలిక వసతుల మెరుగుదల అంశాలపై కమిటీ సభ్యులు, వైద్యులు, సిబ్బందితో ఎమ్మెల్యే ఉగ్ర చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు, పరిశుభ్రత, మందుల లభ్యత, వైద్య సిబ్బంది సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగేలా సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు బుల్లా బాలబాబు, షేక్ ఖాజా రహిమాన్, చన్న సాయి, కోమల దేవి, షేక్ అక్బర్ వలి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట సుబ్బయ్య, తిరుపతిరెడ్డి, సునీత, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోగి చిరునవ్వే నర్సులకు నిజమైన పురస్కారం



**కనిగిరి, మే 12, ప్రభాతవార్త**

అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురష్కరించుకుని మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్, కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కారక్యక్రమం మన నర్సులు- మన భవిష్యత్తు- సాధికారత పొందిన నర్సులు ప్రాణాలను కాపాడతారు అనే నినాదంతో సాగింది. ఈ సందర్భంగా నర్సులను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించి వైద్య రంగంలో వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. రోగుల సేవలో నర్సులు నిరంతరం అంకితభావంతో పని చేస్తూ ఆరోగ్య వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలుస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. రోగి కోలుకుని చిరునవ్వుతో ఇంటికి వెళ్లడం నర్సులకు లభించే నిజమైన పురస్కారమని అభిప్రాయపడ్డారు. కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్, మాజీ కనిగిరి మున్సిపల్ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ నర్సుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవని అన్నారు. కరోనా మహమ్మారి సమయంలో నర్సులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించారని కొనియాడారు. కమ్యూనిటీ వైద్యశాలసూపరింటెండెంట్ డాక్టరన సుబ్బయ్య మాట్లాడుతూ న్సులు వైద్య సేవల్లో కీలకపాత్ర పోషిస్తూ రోగులకు ధైర్యం నింపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్‌బాబు, కమ్యూనిటీ వైద్యశాల డాక్టర్లు, కేఎస్ఎం ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధి షేక్ సుహైల్(బన్ను), వైద్య సిబ్బంది, నర్సులు, ఆశా కార్యకర్తలు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### పామూరుకు చెందిన వనజారెడ్డికి రాష్ట్రస్థాయి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు



**పామూరు, మే 12, ప్రభాతవార్త**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా సన్మానం ప్రశంసా పత్రం గత 28 సంవత్సరాలుగా నర్సింగ్ కళాశాల లో ఉత్తమ సేవలు అందించి నర్సింగ్ విద్యార్థులకు శిక్షణతో పాటు నైపుణ్యాన్ని అందించి రాష్ట్ర స్థాయిలో ఫ్లోరెన్స్ నైటింగేల్ రాష్ట్రస్థాయి ప్రథమ అవార్డు పామూరుకు చెందిన వనజా రెడ్డి అందుకోవడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. అంతర్జాతీయ నర్సులు దినోత్సవాన్ని పురష్కరించుకుని గుంటూరులో జరిగిన ప్రత్యేక కార్యక్రమం ద్వారా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వనజారెడ్డిని దుశ్శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. 28 సంవత్సరాల అనుభవంలో 19 సంవత్సరాలు నెల్లూరు నారాయణ కళాశాలలో నర్సింగ్ ప్రిన్సిపాల్‌గా ఉత్తమ సేవలు అందించడమే కాక తమ ప్రతిభ పాటవాలతో ఎంతో మంది రోగులకు వైద్య సేవలు అందించిన ఘనత వనజారెడ్డికి దక్కుతుంది. ఎమ్మెస్సీ(ఎన్)పీహెచ్‌డీ చేసిన విద్యావంతురాలుగా ఆమెకు మంచి పేరు ఉంది. గత సంవత్సరం అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ శాఖలో రాష్ట్రస్థాయి ఉపాధ్యక్షురాలుగా ఎంపికై గుర్తింపు పొందింది. నర్సింగ్ వృత్తిలోనే కాకుండా నాయకత్వ పటిమలో తన ప్రత్యేకతను చాటుకుంటూ రాష్ట్ర స్థాయిలో డాక్టర్లచే ప్రముఖ వైద్య కళాశాలచే ప్రశంసా పత్రం అందుకుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా రోగులకు నర్సులు ఏ విధంగా వైద్య సేవలు అందించాలనే విషయంపై ప్రతినిత్యం పరిశోధన చేసి వాటిని ప్రిన్సిపాల్‌గా విద్యార్థులకు సృజనాత్మకంగా తెలియజేస్తూ ఎప్పటికప్పుడు సుశిక్షితులైన నర్సులను తయారు చేయడమే వనజారెడ్డి యొక్క ప్రత్యేకత.



## హనుమాన్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం



**పామూరు, మే 12, ప్రభాతవార్త**

హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ మదన వేణుగోపాల స్వామి దేవస్థానం వద్ద పూజా కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పామూరు సీఐ వినోద్‌కుమార్, ఒగురు ఏడుకొండలు, ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల బెస్త సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బ్లడ్ క్యాంపు నిర్వహించిన వారు రామిశెట్టి వీరాంజి, సిద్దవటం భాను ప్రకాష్‌రెడ్డి, బజరంగదళ్ సభ్యులు జమకాల నరేష్, ఓబులేసు పాల్గొన్నారు.

### పల్లా శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన యారవ శ్రీనివాసులు



**పామూరు, మే 12, ప్రభాతవార్త**

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు జన్మదిన సందర్భంగా మంగళవారం నాడు కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి రోజురోజుకి జనాధరణ పెరుగుతుందని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో డబుల్ ఇంజన్ సర్కార్ ముందుకు దూసుకుపోతుందని యారవ శ్రీనివాస్ తెలిపారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పనిచేయాలి

### - అద్దంకి ఆర్డీవో జాన్సన్



**సంతమాగులూరు, మే 12, ప్రభాతవార్త**

రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి క్షేత్రస్థాయి నుంచి అధికారులు చొరవ చూపాలని అద్దంకి ఆర్డీవో జాన్సన్ సూచించారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు ఈనెల 15న సంతమాగులూరులో పల్లె నిద్ర నిర్వహించే అవకాశం ఉన్న నేపథ్యంలో మంగళవారం ఆయన సంతమాగులూరు గ్రామాన్ని సందర్శించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనగణన గృహ గణనలో జిల్లాలో సంతమాగులూరు మండలం వెనుకబడిందని, ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 15న జిల్లా కలెక్టర్, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంతమాగులూరులో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడంతో పాటు పల్లె నిద్ర చేసే అవకాశం ఉన్నందున గ్రామాల వారీగా రెవెన్యూ రికార్డులను పూర్తిగా పరిశీలించి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ కే. రవిబాబు, మండల అభివృద్ధి అధికారి గద్దల జ్యోతిర్మయి, డిప్యూటీ తహసీల్దార్ రాఘవరావు, ఆర్ఐ రామారావు, మండల సర్వేయర్ సాంబశివరావు, సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, వివిధ గ్రామాల వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో బాలభారతి విద్యార్థి ప్రతిభ



**సంతమాగులూరు, మే 12, ప్రభాతవార్త**

గుంటూరు జిల్లా మోతడక గ్రామంలోని చలపతి ఫార్మా కాలేజ్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఓపెన్ చదరంగం పోటీలలో సంతమాగులూరుకు చెందిన బాల భారతి పాఠశాల పదవ తరగతి విద్యార్థి గడ్డం సత్య మహేష్ రెడ్డి ఐదవ స్థానం సాధించి ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా విద్యార్థిని అకాడమిక్ డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లు, పాలనాధికారి దుగ్గంపూడి పవన్ కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, సహచర విద్యార్థులు అభినందించారు.

### పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే సమతుల్య ఆహారం అవసరము - పి.డి.నాగమణి



**సంతమాగులూరు, మే 12,ప్రభాతవార్త**

పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే సమతుల్య ఆహారం అవసరమని, కిషోర వికాసం ద్వారా బాలబాలికల్లో సానుకూల దృక్పథం పెంపొందించాలని ప్రకాశం జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగమణి అన్నారు. మండల కేంద్రమైన సంతమాగులూరు లోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం కిషోర వికాసం మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మే 1 నుంచి జూన్ 9 వరకు నిర్వహిస్తున్న కిషోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా ప్రతి వారం రెండు రోజులు మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చిన అనంతరం గ్రామ స్థాయి కమిటీ సభ్యుల ద్వారా 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిక్షణలో "ఆరోగ్యం మరియు పోషణ" అంశంపై సంతమాగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా వేసవి సెలవులను క్రీడలు, పుస్తక పఠనం, పెయింటింగ్ వంటి మంచి అలవాట్లను వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో కమిటీ సభ్యులంతా చురుకుగా పాల్గొని కిషోర్ వికాసం ద్వారా పిల్లలను చైతన్యపరచాలని ఎంపీడీవో జ్యోతిర్మయి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ డి.సుధ, తాసిల్దార్ కె రవిబాబు, ఎంఈఓ వేమవరపు కోటేశ్వరరావు, ఏపీఎం హనుమంతరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సుష్మరాణి, జి.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసరావు దంపతుల 49 వ వివాహ వార్షికోత్సవం



**అద్దంకి , మే 12, ప్రభాతవార్త**

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో, సీనియర్ రొటేరియన్ మలాది శ్రీనివాసరావు, పద్మావతి 49 వ వివాహ వార్షికోత్సవము సందర్భంగా సింగరకొండ శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బాచిన శివధర పూర్ణ చంద్రరావు, సెక్రటరీ అళహరి హరిబాబు, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, పువ్వాడ రామ కోటేశ్వరరావు, పసుపులేటి ఆంజనేయులు, అడ్వకేట్ రమేష్ బాబు, జాగర్లమూడి శివకుమారి, పార్వతి, అంజాద్ భాష,లక్ష్మీ రెడ్డి, బి.సుబ్రహ్మణ్యం, ఆశ్రమనిర్వాహకులు పూర్ణయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రంలో పులిహార, దద్దోజనం పంపిణీ



**అద్దంకి , మే 12, ప్రభాతవార్త**

అద్దంకి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో హనుమత్ జయంతి సందర్భంగా కొత్తమాసు చంద్ర, వారి కుటుంబసభ్యులు పులిహార, దద్దోజనాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ప్రతి రోజు ఈ చలివేంద్రంలో మజ్జిగ, మంచినీరు పంపిణీ చేస్తున్నారు. అయితే ముఖ్యమైన పండుగల సందర్భంగా ప్రత్యేకంగా దాతల సహకారంతో అల్పాహారాన్ని కూడ ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## కీబోర్డ్ ప్లేలో నక్షత్రకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్




**వేటపాలెం, మే 12, ప్రభాతవార్త**

విజయవాడ హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ప్రాంగణం లో జరిగిన గిన్నిస్ అచీవర్స్ మీట్‌లో వేటపాలెం రామా నగర్ నివాసి కొమరబత్తిన దివ్య నక్షత్ర తండ్రి రత్నరాజు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం జరిగింది. హైదరాబాద్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమంలో 22 దేశాల నుండి 2వేల మంది కీబోర్డు వాయిద్య కారులు, గంట పాటు కీబోర్డు ఆగకుండా వాయిస్తూ పాల్గొన్నారు. కీబోర్డు వాయించుటలో 777 మంది విద్యార్థులు ప్రతిభ కనపరిచి ఎంపికయ్యారన్నారు. ఈ విజేతలలో రామానగర్‌కు చెందినదివ్య నక్షత్ర గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకోవడం గమనార్హం. దివ్య ఆల్టాస్ ఇంటర్నేషనల్ స్కూల్ నందు 9వ తరగతి చదువుతుంది. ఈ ప్రతిభావంతులకు స్కూల్ వ్యవస్థాపకులు ఆగస్టిన్ దండింగి విజయవాడలో స్వయంగా సర్టిఫికేట్లు అందజేసి అభినందించారు. దివ్య గతంలో ను 8వ తరగతి ఒలింపియాడ్ ఇంగ్లీష్ సబ్జెక్టు నందు గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు, మిత్రులు, స్థానికులు నక్షత్రకు అభినందనలు తెలియజేశారు.

## సింగరకొండలో ఘనంగా హనుమత్ జయంతి పూజలు

### - అత్యంత వైభవంగా కోటి తలంబ్రాల శోభాయాత్ర



**అద్దంకి, మే 12, ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి సన్నిధిలో హనుమత్ జయంతి పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఉదయం 9 గంటలకు స్వామి వారికి స్నపన తిరుమంజనం, ఉత్సవ మూర్తుల అభిషేకంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమైయ్యాయి. అదే విధంగా కదళీ ఫలార్చాన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీసీతారాముల కళ్యాణాన్ని పురస్కరించుకొని అద్దంకిలోని మాధవస్వామి దేవాలయం వద్దనుండి కోటి తలంబ్రాల శోభాయాత్ర అత్యంత వైభవంగా ప్రారంభమైయింది. ఎండ్లబండ్లతో అత్యధిక సంఖ్యలో మహిళలతో కూడిన ముత్యాల తలంబ్రాలతో పండ్లు, పుష్పాలతో, మంగళవాయిద్యాముల, అధ్యాత్మిక సంకీర్తనలతో, సింగరకొండ



ప్రసన్నాంజనేయస్వామి సన్నిధి వరకు ఈ శోభాయాత్ర సాగింది. ఎండ్లబండ్లపై పాలకమండలి చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, పాలకమండలి సభ్యులు, ఎసి.తిమ్మానాయుడు తదితరులు శోభా యాత్ర అగ్రభాగాన్న నిలచి, సింగరకొండ స్వామి వారి సన్నిధి వరకు ఈ యాత్ర సాగింది.

## రేపే సంతమాగులూరులో పల్లె నిద్ర

### - పాల్గొననున్న మంత్రి గొట్టిపాటి, కలెక్టర్ రాజబాబు



**సంతమాగులూరు, మే 12, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన సంతమగులూరులో ఈనెల 15వ తేదీన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పల్లెనిద్ర కార్యక్రమం ఏర్పాట్లను అధికారులు మంగళవారం పరిశీలించారు. కార్యక్రమం నిర్వహణకు సంబంధించి అందిన సమాచారంతో అద్దంకి ఆర్డిఓ జాన్సన్, సంతమాగులూరు తహసీల్దార్ కే. రవిబాబు, ఎంపీడీవో గెద్దల జ్యోతిర్మయి, సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తేలప్రోలు రమేష్ తదితరులు



వేదిక ప్రాంతంతో పాటు మండల కార్యాలయాల సముదాయాలను సందర్శించి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

## సింగరకొండలో పూజలు నిర్వహించిన భద్రారెడ్డి





**అద్దంకి , మే 12, ప్రభాతవార్త**

హనుమత్ జయంతి సందర్భంగా సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయాన్ని వైసిపి సీనియర్ నాయకులు వైవి భద్రారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి వారి పూజలలో ఆయన పాల్గొన్నారు. వేదపండితులు భద్రారెడ్డికి ఆశ్వీరచనాలు, తీర్థ ప్రసాదాలు, స్వామి వారి శేషవస్త్రాన్ని అందజేశారు. ఆలయంలో ఎసి తిమ్మానాయుడు, పాలకమండలి చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావుతోపాటు నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భద్రారెడ్డి వెంట వున్నారు.

## హనుమాన్ జయంతి వేడుకలలో వైవి భద్రారెడ్డి





**కొరిసపాడు, మే 12, ప్రభాతవార్త**

హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం మండలం లోని అన్ని గ్రామాల ప్రజలు అంజనీ సుతుని భక్తిశ్రద్ధలతో పూజించి తమ భక్తి భావాన్నిచాటుకున్నారు. ముఖ్యం గా మండలంలోని మేదరమెట్ల పరిధిలోని సోమవరప్పాడు గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవస్థానం నందు వైసిపి నాయకులు, అద్దంకి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వై.వి భద్ర రెడ్డి తన అనుచరులతో కలసి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పండుగనాడు స్వగ్రామానికి వచ్చిన ఆయనను యర్రం కుటుంబ అభిమానులు, వైసిపి కార్యకర్తలు, గ్రామస్తులు కలిసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం దేవస్థానం నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్య క్రమాలలో వైవి భద్రారెడ్డి వెంట అద్దంకి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కోయి అంకారావు, వైసీపీ నాయకులు ఓగూరి ఆంజనేయులు, కర్నాటి వెంకట్రావు, మన్నె చిన్నబ్బాయి, కేశవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సింగరకొండలో భక్తులకు మజ్జిగ పంపిణీ

### - మజ్జిగ పంపిణీ ప్రారంభించిన భద్రారెడ్డి






**అద్దంకి , మే 12, ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలో హనుమత్ జయంతి, శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవ సందర్భంగా మంగళవారం సింగరకొండకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వేసవీ వెండ తాపం నేపద్యంలో భక్తులకు వైసిపి నాయకులు మోటుపల్లి శివరామకృష్ణ ప్రసాద్(చిన్న) మజ్జిగను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని వైసిపి సీనియర్ నాయకులు భద్రారెడ్డి ప్రారంభించారు. ముందుగా మజ్జిగ పంపిణీ శిబిరం వద్ద పూజలు నిర్వహించి, మజ్జిగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 3500 మందికి మజ్జిగను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైవి భద్రారెడ్డితోపాటు అద్దంకి పట్టణ,మండల,మేదరమెట్లకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ద్వారాకనగర్ వద్ద రోడ్డు ప్రమాదం

### - ఒక వ్యక్తి మృతి



**అద్దంకి , మే 12, ప్రభాతవార్త**

అద్దంకి -సింగరకొండ రోడ్డులోని ద్వారాకనగర్ సమీపంలో ద్విచక్రవాహన చోదకుడుని కారు ఢీకొట్టగా ఆ వ్యక్తి అక్కడిక్కడే మృతిచెందాడు. అందిన వివరాలు ప్రకారం ద్వారాకనగర్ సమీపంలో జంక్షన్ వద్ద గోపాలపురానికి చెందిన పుల్లయ్య అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో పుల్లయ్య అక్కడిక్కడే మృతి చెందాడు.

## కాకాని చెరువులో లభ్యమైన రెండో మృతదేహం

### - మృతదేహాలకు కన్నీటి వీడ్కోలు పలికిన కొమ్మాలపాడు ప్రజలు



**సంతమాగులూరు, మే 12, ప్రభాతవార్త**

పల్నాడు జిల్లా నరసరావుపేట రూరల్ మండలం కాకాని చెరువులో సోమవారం జరిగిన పడవ మునక ప్రమాదంలో గల్లంతైన కొమ్మాలపాడు గ్రామానికి చెందిన అగ్రహారం హుస్సేన్ (35) మృతదేహం ఎట్టకేలకు మంగళవారం వేకువజామున నాలుగు గంటల ప్రాంతంలో చెరువులో నీటిపై తేలింది. మృతదేహాన్ని గమనించిన స్థానికులు గట్టుకు చేర్చగా పోలీసులు బందోబస్తు మధ్య నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ పిట్టమల్ల హుస్సేన్ బుడే (58), అగ్రహారం హుస్సేన్ మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాలను మంగళవారం మధ్యాహ్నానికి కొమ్మాలపాడు గ్రామానికి తీసుకురాగా గ్రామమంతా విషాదంలో మునిగిపోయింది. మృతదేహాలకు కొమ్మాలపాడు ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. సాయంత్రానికి బంధువులు, గ్రామస్తులు, స్నేహితుల నడుమ అంత్యక్రియలు నిర్వహించారు.

